# పేదలకు సన్నబియ్యం

## తెలంగాణ అన్నపూర్ణ పథకాన్ని ప్రకటించిన కేసీఆర్

### మ్యానిఫెస్టోలో పొందుపరిచ్చిన బీఆర్ఎస్

- అధికారంలోకి రాగానే రేషన్ షాపుల ద్వారా సరఫరా
- జిల్లాలో 2,16,942 కుటుంబాలకు ప్రయోజనం
- ప్రస్తుతం నెలకు 4,220 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
- సర్వత్రా స్వాగతిస్తున్న సబ్బండ వర్గాలు
- ఇప్పటికే స్కూళ్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీలకు సన్నబియ్యం



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఏ ఒక్కరూ అర్ధాకలితో ఉండకూడదనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మరో చారిత్రాత్మక పథకానికి శ్రీకారం చుడుతున్నారు. పేదలందరికీ సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా తెలంగాణ అన్నపూర్ణ పథకాన్ని ప్రకటించారు. అధికారంలోకి రాగానే తెల్లరేషన్ కార్డులు ఉన్న వారందరికీ సన్నబియ్యం ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే అమలు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో 2,16,942 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక రేషన్ కోటా పెంచారు. ప్రతి నెలా రూపాయికే కిలో బియ్యం చొప్పున నెలకు 4220 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే సంక్షేమ హాస్టళ్లు, మధ్యాహ్నం భోజనం అంగన్‌వాడీలకు ఠంఛన్‌గా సన్నబియ్యం అందుతున్నది. ఇప్పుడు పేదలందరికీ ఇస్తారని, తాము కేసీఆర్‌కు అండగా ఉంటామని సబ్బండ వర్గాలు స్వాగతిస్తున్నాయి.

సీఎం కేసీఆర్ ఇటీవల బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నారు. తెలంగాణ ప్రజలకు ఇంకా ఫలాలు అందాలనే లక్ష్యంగా మరికొన్ని పథకాలను ప్రకటించారు. అందులో తెలంగాణ అన్నపూర్ణ పథకం కూడా ఒకటి. దీని ప్రకారం తెలంగాణలో రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు సన్నబియ్యం అందనున్నాయి. ప్రస్తుతం రేషన్ షాపుల ద్వారా రూపాయికే కిలో దొడ్డుబియ్యం పంపిణీ చేస్తున్నారు. కానీ, వాటిని చాలా మంది తినకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

### నెలకు 4,220 మెట్రిక్ టన్నుల బియ్యం

యాదాద్రి భువనగిరి జిల్లాలో 515 రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. 2,16,942 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 4, 220 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కంటే ముందు ఒక్కో వ్యక్తికి 5కిలోలు అందించగా, కుటుంబంలో గరిష్ఠంగా ఐదుగురికి మాత్రమే ఇచ్చేవారు. కానీ, స్వరాష్ట్రంలో 2015 జనవరి ఒకటో తేదీ నుంచి ఒక్కొక్కరికి 6 కిలోలు ఇవ్వడంతోపాటు కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఈ పాస్ విధానం ద్వారా పంపిణీ చేస్తున్నారు. కొవిడ్-19 ఆపత్కాలం నుంచి రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు.

### ఇప్పటికే విద్యా సంస్థలకు సన్నబియ్యం..

ఇప్పటికే రాష్ట్రంలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తున్నది. గతంలో హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీలకు దొడ్డుబియ్యం అందించేవారు. కానీ, సీఎం కేసీఆర్ గొప్ప నిర్ణయంతో 2015 జనవరి ఒకటో తేదీ నుంచి ఆయా విద్యాసంస్థలకు సన్నబియ్యం అందిస్తున్నారు. జిల్లాలో 260 టన్నుల నాణ్యమైన సన్నబియ్యాన్ని హాస్టళ్లు, మధ్యాహ్న భోజనానికి సరఫరా చేస్తున్నారు. సుమారు 63,619 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు.

### సన్నబియ్యం ఇస్తే సంతోషకరం



రేషన్ ద్వారా పేదలకు సన్నబియ్యం అందిస్తామని సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడం సంతోషకరం. గత ప్రభుత్వాలు దొడ్డు బియ్యం ఇవ్వడంతో వాటిని తినాలంటే ఇబ్బందిగా ఉండేది. వేలు పెట్టి బియ్యం కొనలేని మాలాంటి వాళ్లకు రేషన్ ద్వారా సన్నబియ్యం ఇస్తానన్న ముఖ్యమంత్రి వెంటే మేమంతా ఉంటాం.

**-పగిళ్ల చంద్రయ్య, కొండభీమనపల్లి, దేవరకొండ**

### మళ్లీ కేసీఆర్ సారే గెలువాలి



నిరుపేదలమైన మేము ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇంట్లోనే ఉంటున్నాం. ఇప్పుడు మాకు సన్నబియ్యం కూడా ఇస్తామంటున్నారు. నూకలు తినే మాలాంటి వాళ్లకు సన్నబియ్యం ఇస్తానంటున్న కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం. మాలాంటి పేదల కోసం అనేక పథకాలు తీసుకొచ్చింది ఆయనే. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ సారే గెలువాలి. ఆయనకే మా ఓటు. మోదీ పెంచుతున్న ధరలతో ఏమీ కొనలేకపోతున్నాం. కేసీఆర్ సారు మళ్లీ గెలిచాక గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తడంట. దాంతో మాకు గ్యాస్ కష్టాలు తొలిగినట్లే. మాలాంటి పేదల కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి సార్‌కు ధన్యవాదాలు.

**-జీడిమెట్ల పాపమ్మ, జి.తిరుమలగిరి, చివ్వెంల**

### పేదల ఆకలి తీర్చే ప్రభుత్వం



వచ్చే ఎన్నికల దృష్ట్యా బీఆర్ఎస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటికీ సన్నబియ్యం అందజేస్తామని ప్రకటించడం హర్షణీయం. ఈ నిర్ణయం మాలాంటి పేదల ఆకలి తీర్చేదిగా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అనేందుకు ఇదే నిదర్శనం. ఇక నుంచి మాకు దొడ్డు బియ్యం తినే ఇబ్బందులు తప్పనున్నాయి. ఎన్నికల తర్వాత ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందించనున్న సన్నబియ్యంతో మూడు పూటలా కడుపు నిండా భోజనం చేస్తాం. గొప్ప నిర్ణయం తీసుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మా మద్దతు.

**-రవి, వేములపల్లి**

---

# రెచ్చగొట్టొద్దు.. సంయమనం కోల్పోవద్దు

- సోషల్ మీడియా కామెంట్లపైనా నిఘా..
- గ్రూప్ అడ్మిన్లదే బాధ్యత అంటున్న పోలీసులు
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల హెచ్చరిక



మిర్యాలగూడ, అక్టోబర్ 18 : చేతిలో ఫోన్ ఉంది కదా అని సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేశారా? ఎవరో పెట్టిన పోస్టు మీకు నచ్చలేదన్న కారణంతో కాస్త కఠినంగా కామెంట్లు చేస్తూ వ్యతిరేకించారా? అయితే పోలీసు కేసుల్లో ఇరుక్కున్నట్లే. ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెడుతూ వచ్చిన పోలీసులు.. ఇప్పుడు పోస్టుల కింద కామెంట్లు పెడుతున్న వారిపైనా నిఘా ఉంచనున్నారు. ఐటీ చట్టంతో పాటు ఐపీసీ కింద కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకుల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటున్న నేపథ్యంలో పోస్టింగ్‌ల విషయంలో జాగ్రత్తలు అత్యవసరం.

### కామెంట్ల విషయంలో అప్రమత్తత అవసరం

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు, పాస్‌పోర్టులకు



దరఖాస్తు చేసుకునేవారు, విద్యార్థులు, యువత ఇటువంటి వాటిలో ఇరుక్కుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

రాజకీయ పరిణామాలు, ఎన్నికల వ్యవహారంలో సంయమనం పాటించాలని స్పష్టం చేస్తున్నారు. సాధారణ సమయంలో సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెడితే నమోదయ్యే కేసులకు, ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులకు చాలా తేడా ఉంటుందని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కఠినమైన సెక్షన్లు పొందుపరిచి కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### గ్రూప్ అడ్మిన్లదే బాధ్యత



రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాల్లో ప్రజలను రెచ్చగొట్టేలా రాజకీయ ప్రసంగాలు పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వివిధ సామాజిక మాధ్యమాల్లో నమోదవుతున్న పోస్టులను సైబర్ టీం అణువణువునా పర్యవేక్షిస్తూనే ఉంటుంది. సామాజిక మాధ్యమాలపై నిరంతరం సైబర్ పెట్రోలింగ్ జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అందరు సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిందే. అదేవిధంగా ఏ గ్రూపులో అయితే అభ్యంతకర పోస్టులు, కామెంట్లు పెడతారో అందుకు ఆ గ్రూప్ అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**– వెంకటగిరి, డీఎస్పీ, మిర్యాలగూడ**